
సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పిన్నెల్లిరామకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్


సీఎం సభలో పాల్గొన్న అశేష జనవాహిని..

క్లుప్తంగా

సుఖీభవ



పిడుగురాళ్ల: పట్టణంలోని 26వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు అల్లు వెంకట శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పింఛనుదారులకు సోమవారం మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, చైతన్య గోదావరి, జీడీసీసీ బ్యాంక్ బ్రాంచ్‌ల వద్ద పింఛను నగదు తీసుకునేందుకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు సుమారు 200 మజ్జిగ ప్యాకెట్లు, 200 వాటర్ బాటిళ్లు అందజేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఇంటి వద్దకే పింఛను అందిస్తే.. చంద్రబాబు నాయుడు కుటిల రాజకీయం వల్ల వృద్ధులు అల్లాడిపోతున్నారన్నారు. బంగారురెడ్డి, నాగిరెడ్డి, సాంబయ్య, నిరంజన్, సాంబయ్య, నరసింహారెడ్డి, గౌష్ బాషా ఉన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్



మాచర్ల రూరల్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో రెండవ రోజు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ పటిష్ట బందోబస్తు మధ్య ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 2,164 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా..మొదటి రోజు 1,020కి పైగా, రెండవ రోజు 791 మంది ఓటు వేశారని తెలిపారు. ఇంకా నమోదు చేయించుకోవాల్సిన వారు ఫారం 12 దరఖాస్తు చేసుకొని, ఓటు పొందవచ్చన్నారు. ఓటర్లకు షామియానాలు, మంచినీరు, మజ్జిగ వంటి వసతులు కల్పించినట్లు చెప్పారు.

రెండో రోజు పోలైన 893 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

గురజాల : విధుల్లో ఉన్న ఉద్యోగులు 893మంది రెండవ రోజు సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 554 మంది గురజాల నియోజకవర్గ ఓటర్లు కాగా 339 మంది ఇతర జిల్లాలకు చెందిన వారు ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి జీవీ రమణా కాంత్‌రెడ్డి తెలిపారు. గురజాల నియోజకవర్గంలో మొత్తం 2,093 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయనున్నట్లు తెలిపారు. మంగళ, బుధవారల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అవకాశం కల్పించినట్లు చెప్పారు.

అనిల్, పీఆర్కేను గెలిపించండి

మాచర్ల: వైఎస్సార్ సీపీ నర్సరావుపేట, మాచర్ల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పి.అనిల్ కుమార్ యాదవ్, పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మద్దతుగా సమాజ్ వాది పార్టీ సీనియర్ నాయకుడు శాకమూరి సాంబశివరావు యాదవ్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాచర్ల పట్టణం, రూరల్, వెల్దుర్తి మండలంలో భైరవునిపాడు, తాళ్ళపల్లి, తేరాల, ఉప్పలపాడు, కారంపూడిలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

వైఎస్సార్ సీపీ నేత వరిగడ్డి వాము దగ్ధం



దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడులో సోమవారం వైఎస్సార్ సీపీ నేత టంటం నరసింహారావుకి చెందిన 200 కట్టల వరిగడ్డి వాము అగ్నికి ఆహుతైంది. బాధితుడి వివరాల మేరకు..మూగజీవాల కోసం వరిగడ్డిని నరసింహారావు కొనుగోలు చేశాడు. మధ్యాహ్నం సమయంలో వరిగడ్డి వాము కాలిపోతున్నట్లుగా స్థానికులు గుర్తించి, నరసింహారావుకి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం తను కష్టపడుతుండటం చూసి తట్టుకోలేని టీడీపీ, జనసేన నాయకులు వరిగడ్డిని తగులబెట్టారని బాధితుడు నరసింహారావు ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని బొప్పూడి గ్రామంలో ఈనెల 4వ తేదీన ఓ వ్యక్తి ఫిట్స్‌వచ్చి నేలకు ఒరిగాడు. స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా చిలకలూరిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అయితే మృతుని పేరు శివ అని మాత్రమే చెప్పాడని అతని పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు.

మురిసిన మాచర్ల..



మాచర్ల: మాచర్ల మురిసింది. పల్నాడు కదిలింది. జన నేతను చూసేందుకు ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా మాచర్ల సభకు చేరుకున్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని 'మండే' సూరీడుని సైతం లెక్కచేయగా ఆసాంతం వీక్షించారు. బహిరంగ సభా ప్రాంతం చెన్నకేశవస్వామి తిరునాళ్లను తలపించింది. రైతులు, కార్మికులు, మహిళలు జై జగన్ అంటూ జేజేలు పలికారు. బస్సులో సభకు వచ్చిన సీఎం జగన్‌కు అభివాదం చేస్తూ.. కేరింతలు కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని వెల్దుర్తి, మాచర్ల, దుర్గి, రెంటచింతల, కారంపూడితో పాటు మాచర్ల పట్టణంలోని ప్రతి వార్డు నుంచి ప్రజలు భారీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పి.అనిల్‌కుమార్ యాదవ్, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, సీనియర్ నేత కొమ్మారెడ్డి చలమారెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ళ రేవతి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి పాల్గొన్నారు.

కదలిన శ్రేణులు

- సీఎం వైఎస్ జగన్ సభకు తరలిన పార్టీ శ్రేణులు
- బండ్లు కట్టుకుని, ఎండను లెక్కచేయక చాటుకున్న అభిమానం


కారెంపూడి: కారెంపూడి తండా నుంచి..


కారెంపూడి ఇందిరానగర్ కాలనీ నుంచి..


ఒప్పిచర్ల గ్రామం నుంచి..


మాచర్ల రూరల్: సీఎం సభకు వెళ్తున్న మహిళలు


వెల్దుర్తి: సీఎం జగన్ బహిరంగ సభకు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు


మాచర్ల రూరల్: బైకు ర్యాలీతో జగనన్న సభకు..


విజయపురిసౌత్ నుంచి జగన్ సభకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు


దుర్గి నుంచి సీఎం జగన్ సభకు నాయకులు, కార్యకర్తలు

గాయమైనా.. కాయం ఆగలేదు



చేతికి గాయమైనప్పటికీ.. మా అభిమాన నేత మా ప్రాంతానికి వస్తుంటే చూడకుండా ఉండలేకపోయాను. వైఎస్ జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ఉంది. ప్రతి కుటుంబంలో పెద్ద కొడుకుగా సంక్షేమ పథకాలను ఇళ్లకే చేర్చారు ఆయన.

– నాగూరి చెంచిరెడ్డి, మాచర్ల.

రాజన్న బిడ్డకు మేమే అండ..



మాది నిరుపేద వ్యవసాయ కుటుంబం. ఎలాంటి రికమండేషన్లు లేకుండా మాకు ప్రభుత్వ పథకాలు అందాయి. 2019 నుంచి నేటి వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాలాంటి పేదలకు అండగా ఉంది. ముస్లిం మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌ది.. ఆయన బిడ్డకు మేము అండగా ఉంటాం.

– షేక్ నబీ, మిర్యాల.

రుణం తీర్చుకుంటాం



సీఎం జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు మా గడప వద్దకే వచ్చాయి. మా బతుకుల్లో వెలుగులు నిండాయి. గత టీడీపీ ప్రభుత్వంలో మాకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు. జన్మభూమి కమిటీలతో వారి అనుచరులకు, వర్గాలకు దోచిపెట్టారు. మే 13న జగనన్న రుణం తీర్చుకుంటాం.

– కల్లం మల్లీశ్వరి, లక్ష్మీపురం.

యరపతినేని గుంటూరు పారిపోవడం ఖాయం


ఇరికేపల్లిలో ఎమ్మెల్యే కాసుకి హారతి ఇచ్చి తిలకం దిద్దుతున్న మహిళలు

- 50వేలకు పైగా మెజార్టీతో గెలుస్తా..
- చంద్రబాబు మేనిఫెస్టో అబద్ధాల పుట్ట
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కే న్యాయం చేయలేని చంద్రబాబు.. ప్రజలకేం న్యాయం చేస్తారని గురజాల వైఎస్సార్ సీపీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి, నడికుడి, నారాయణపురంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎమ్మెల్యే మహేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చేంత వరకే చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతూ.. మోస పూరిత మాటలు చెబుతారని, అధికారంలోకి వచ్చాక ప్రజల నమ్మకాన్ని నిలువునా పాతరేస్తారని దుయ్యబట్టారు. చంద్రబాబు మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అని, దానిని పట్టుకునేందుకు కూడా బీజేపీ నేతలు ఇష్టపడటం లేదన్నారు. అమలు చేసే ఉద్దేశం చంద్రబాబుకి లేదు కాబట్టే అమలుకి సాధ్యం కానీ హామీలను ప్రకటించారని పేర్కొన్నారు.

యరపతినేని గుంటూరు పారిపోవటం ఖాయం..

ప్రజల అభిమానం, అప్యాయతను చూస్తే గత ఎన్నికల్లో 28 వేల మెజార్టీతో గెలిచానని, ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుపై 50 వేల ఓట్ల మెజార్టీతో ప్రజలు తనను గెలిపించటం ఖాయమన్నారు. యరపతినేని శాశ్వతంగా గుంటూరుకి పారిపోతాడన్నారు. ఈ నెల 13న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై రెండు సార్లు బటన్ నొక్కి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్‌ని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాసు కోరారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర పంచాయతీ చైర్మన్ సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు విజయ్‌కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మాజీ చైర్మన్ పున్నారావు, వైస్ చైర్మన్లు విజయ్‌కుమార్, షేక్ ఖాదర్ బాషా, కౌన్సిలర్లు వీరారెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మీ ప్రసన్న, వెంకట్రామయ్య, గురువులు, కో–ఆప్షన్ సభ్యులు ధర్మదేవ్, రఫీ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సైదా, నాయకులు కృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, వెంకటరెడ్డి, శివారెడ్డి, రామిరెడ్డి, హనుమంతరావు, రాంబాబు, కిరణ్, అశోక్‌కుమార్, అనిల్, నాగరాజు, ఏలియా, కిషోర్, ఏర్రయ్య, ఏసుదానం, మేరిబాబు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

చేసిన మంచి చెప్పి ఓటు అడిగే ధైర్యం మాకుంది..

వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి


కరపత్రం అందజేస్తున్న దేవళ్ల రేవతి

పిడుగురాళ్ల: 'మా గత పాలన చూసి.. మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటు వేయండి.' అని ధైర్యంగా ప్రతి వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్యకర్త ఇంటింటికి వెళ్లి అడిగేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేశారని వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి అన్నారు. పట్టణంలోని 11, 12వ వార్డుల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కల్యాణ్ 2014 నుంచి 2019 వరకు తమ పాలన నచ్చితే ఓటు వేయండి అని ప్రజలను అడిగే దమ్ముందా అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ పాలన, వలంటీర్, సచివాలయ వ్యవస్థ కావాలని నిర్ణయించుకుని, నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌ను, గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డిని ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, బీసీ సెల్ కన్వీనర్ శివయ్య, కౌన్సిలర్లు సుందరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉందాం

మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న యార్డు వైస్ చైర్మన్ వంకాలయ రమేష్

మాచవరం: గత ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించి, రాష్ట్రాభివృద్ధికి ఎంతో దోహదపడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉండాలని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్ అన్నారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో యువజన నాయకుడు కాకరపర్తి రామారావు అధ్యక్షతన మచవరం మండల ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో ఆర్యవైశ్యుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలిపారు. ఉన్నత పదువులు ఇచ్చారని గుర్తు చేశారు. రాజకీయంగా ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్ ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా కాసు మహేష్‌రెడ్డిని, ఎంపీగా పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ కన్వీనర్ చింతా రామారావు, సీనియర్ నాయకులు జూలకంటి శ్రీనివాసరావు, చీదెళ్ల కృష్ణ, మద్దాళి నరసింహారావు, ఎంపీటీసీ గురవయ్య, గుండా వెంకటేశ్వర్లు, లఘువరపు రామారావు పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి వేడుకలు



నకరికల్లు: మాసశివరాత్రి వేడుకలు మండలంలోని నర్సింగపాడులోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ, పమిడిమర్రు శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు. మరకతలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి లక్షమల్లెలతో విశేషంగా అలంకరించారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురుపూజతో మాసశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి.

ముస్లింలు సీఎం జగన్‌కు అండగా ఉండాలి

వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎండీ గఫార్


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మైనార్టీ విభాగం నాయకులు

దాచేపల్లి: ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కొనసాగింపునకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎండీ గఫార్ పిలుపునిచ్చారు. నగర పంచాయతీలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముస్లింల రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ బహిరంగంగానే చెబుతోందన్నారు. ఇలాంటి కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేన పార్టీలకు ముస్లింలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ సుభాని, మార్కెట్ యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, మైనార్టీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు సయ్యద్ మౌలాలీ, నాయకులు షేక్ సైసావలి, గౌరా మేస్త్రీ, గౌసుబాబు, సాహెబ్, మస్తాన్‌వలి, కరిముల్లా, లతీఫ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఇల్లు కట్టించిన 'స్నేహహస్తాలు'



అచ్చంపేట : పెదపాలెంలో రెండు నెలల క్రితం దంతాల నాగరాజు ఇల్లు అగ్నిప్రమాదంలో ఆహుతయింది. దీంతో నిరాశ్రయుడయ్యాడు. స్నేహ హస్తాలు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు మేమున్నామంటూ ముందుకొచ్చారు. ఇంటిని నిర్మించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈమేరకు సోమవారం జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో స్నేహహస్తాల ప్రతినిధి బృందం పాల్గొంది. స్నేహ హస్తాలు ప్రతినిధులైన ప్రవాసాంధ్రులు కూరపాటి శివరామ్, కొబ్బరి నవీన్, పచ్చ అనిల్, సంస్థ గౌరవ సలహాదారు తుమ్మా శాంరెడ్డి, సంస్థ సమన్వయకర్త తాయి కరీముల్లాబాబు తదితరులు పాల్గొన్నారు.

కళలు, కళాకారులను ప్రోత్సహించాలి


వేదాంతం రామలింగశాస్త్రి దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అమరావతి : పాశ్చాత్యత పోకడలు విజృంభిస్తున్న తరుణంలో ప్రాచీన కళలు బతికి బట్టకట్టాలంటే కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కూచిపూడి కళాకారులు, కేంద్ర సంగీతనాటక అకాడమి అవార్డు గ్రహీత వేదాంతం రామలింగశాస్త్రి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక శ్రీ అమరేశ్వర దేవస్థానంలో అమరేశ్వర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి ప్రథమవార్షికోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. శనగవరపు రామ్మోహనశర్మ అధ్యక్షత వహించారు. వేదాంతం రామలింగశాస్త్రి మాట్లాడుతూ పురాతన కాలం నుంచి కళలకు విశిష్ట స్థానం ఉందన్నారు. తల్లి దండ్రులు విద్యార్థులకు చదువుతో పాటు కళల అభ్యాసం పట్ల అభిరుచిపెంచేలా చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం వేదాంతం రామలింగశాస్త్రి దంపతులను శ్రీఅమరేశ్వర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి నిర్వాహకులు మల్లిక్,నాగచైతన్యలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ధాన్యకటక బుద్ధ విహార్ ట్రష్టు ఛైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు, రాజమండ్రి లలిత కళానృత్యనికేతన్ నిర్వా హకులు డాక్టర్ అరవ అంజనేయులు, ముక్కామల నాగచైతన్య, అమరేశ్వరాలయ ఈవో వేమూరి గోపినాధశర్మ సహృదయ ఫౌండేషన్ నిర్వాహకులు పోతురాజు శ్రీనివాస్ పులిపాటివెంకట పవన్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ఈ సందర్భంగా కూచిపూడి నాట్యంలో బంగారు పతక విజేత డాక్టర్ వేదాంతం వాగ్దేవిప్రసాద్ నాట్యప్రదర్శనతో పాటు అమరేశ్వర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి చిన్నారుల నృత్యప్రదర్శన ఆహూతులను ఎంతగానో అలరించింది.

కుంకలగుంటలో యాంకర్ శ్యామల ప్రచారం



నకరికల్లు: మండలంలో కుంకలగుంట గ్రామంలో వైఎస్సార్‌సీపి ఎన్నికల ప్రచారం అట్టహాసంగా నిర్వహించారు. సినీనటి, యాంకర్ శ్యామల,పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహాసంతి, మంత్రి అంబటి రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి, మంత్రి అంబటి సోదరి లక్ష్మి తదితరులు పాల్గొని ప్రచారం చేపట్టారు. గ్రామంలోని ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం పర్యటించి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా మంత్రి అంబటి రాంబాబును, ఎంపీగా పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏపీడీసీ డైరెక్టర్ వీరారెడ్డి, గ్రామనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.